
ఆంధ్రజ్యోతి
ఉష్ణోగ్రతలు గరిష్ఠం : 29.0 | కనిష్ఠం : 23.0
ANDHRAJYOTHY 1
నాగర్‌కర్నూల్
జిల్లా వార్తలు
గురువారం 2 అక్టోబరు 2025













దసరా శుభాకాంక్షలు తెలిపిన మంత్రి జూపల్లి

హైదరాబాద్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రజలకు పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు విజయదశమి(దసరా) పండగ శుభాకాంక్షలు తెలిపారు. విశేష భక్తిశ్రద్ధలతో శరన్నవరాత్రి పూజలు ఒక ప్రత్యేక ఆధ్యాత్మిక వేడుకగా జరుపుకున్నారని అన్నారు. ఊరు, వాడలంతా అమ్మవారి సంబురాలతో భక్తి భావం ఉట్టిపడుతోందన్నారు. ప్రధానంగా ఈ ఏడాది బతుకమ్మ సంబురాలు అంబరాన్ని అంటాయన్నారు. ప్రజా సంక్షేమం-రాష్ట్ర ప్రగతే ధ్యేయంగా శ్రమిస్తున్న ప్రజాప్రభుత్వానికి ప్రజల మద్దతు, దుర్గమ్మ ఆశీస్సులు లభించాలని కోరుకుంటు న్నానని ఆయన బుధవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు.

మన సంప్రదాయానికి ప్రతీక బతుకమ్మ

ఎర్రవల్లి, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): బతుకమ్మ పండుగలో తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడుతాయని అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు అన్నారు. ఎర్రవల్లి మండలంలోని శేకుపల్లి గ్రామంలో బుధవారం బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో అయన పాల్గొని బతుకమ్మ ఆడారు. ఈ వేడుక ల్లో మహిళలు, యువత భారీ సంఖ్యలో పాల్గొ నడంతో ఆ ప్రాంతం సందడిగా మారింది. అంతకు ముందు ఎమ్మెల్యే విజయుడు దుర్గామాతకు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో జడ్పీటీసీ మాజీ సభ్యుడు హనుమంతురెడ్డి, పీఏసీఎస్ అధ్యక్షుడు రంగారెడ్డి, మాజీ సర్పంచ్ రవీందర్‌రెడ్డి, నాయకులు ఉన్నారు.

జములమ్మ క్షేత్రంలో నేడు నిజరూప దర్శనం

- తెప్పోత్సవానికి ఏర్పాట్లు పూర్తి 3

దసరా సందడి

- కొనుగోళ్లతో రద్దీగా మారిన నాగర్‌కర్నూల్, గద్వాల, వనపర్తి పట్టణాలు
- నాగర్‌కర్నూల్‌లో ముస్తాబైన మినీ ట్యాంక్‌బండ్
- నేడు బుద్ద ఘాట్ వద్ద శమీ వృక్షానికి పూజలు



నాగర్‌కర్నూల్ పట్టణంలోని రైతుబజారులో విక్రయానికి ఉంచిన బంతిపూలు

నాగర్‌కర్నూల్ టౌన్/గద్వాల టౌన్/వనపర్తి రాజీవ్ చౌరస్తా, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): నేడు దసరా పండుగను పురస్కరించుకొని నాగర్‌కర్నూల్, జోగుళాంబ గద్వాల, వనపర్తి పట్టణాల్లో కొనుగోలుదారులతో సందడి నెలకొన్నది. గ్రామాలు, మండల కేంద్రాల నుంచి ప్రజలు కొనుగోలు చేసేందుకు జిల్లా కేంద్రాలకు చేరుకోవడంతో పట్టణంలోని దుకాణాలు కిటకిటలాడాయి. నాగర్ కర్నూల్ పట్టణంలోని ప్రధాన రహదారితో పాటు సంతబజారు, రైతుబజారు, నల్లవెల్లి రోడ్డు తదితర ప్రాంతాల్లోని దుకాణ సముదాయాల వద్ద జనం రద్దీ కనిపించింది. పట్టణంలోని కేసరి సముద్రం మినీ ట్యాంక్‌బండ్‌ను ముస్తాబు చేశారు. ట్యాక్‌బండ్ ప్రవేశ ద్వారం నుంచి బతుకమ్మ ఘాట్, లవ్ ఎన్‌జీకేఎల్, బుద్ద ఘాట్ వరకు విద్యుత్ దీపాలతో అలంకరించారు. బుద్ద ఘాట్‌లోని శమీ వృక్షం వద్ద రంగులు వేశారు. బతుకమ్మ ఘాట్ వద్ద పార్కులో ప్రత్యేకంగా అలంకరించిన వేదిక వద్ద మహిళలు బతుకమ్మ ఆడేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. చాలా రోజులుగా నిలిచిపోయిన చెరువులో లాంచి ప్రయాణం సోమవారం నుంచి తిరిగి పునరుద్ధరించడంతో పట్టణ ప్రజలు కేసరిసముద్రం అందాలను తిలకిస్తూ సందడి చేస్తున్నారు.

శమీ వృక్షానికి పూజ చేయనున్న ఎమ్మెల్యే

దసరా ఉత్సవాల సందర్భంగా కేసరిసముద్రం మినీ ట్యాంక్ బండ్ బుద్దఘాట్ వద్ద శమీ వృక్షానికి స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ కూచకుళ్ల రాజేశ్‌రెడ్డి పూజలు చేయనున్నారు. అనంతరం బతుకమ్మ ఘాట్ వద్ద మహిళలతో కలిసి బతుకమ్మ సంబురాల్లో పాల్గొననున్నారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

గద్వాల పట్టణంలో..

గద్వాల పట్టణంలోని ప్రధాన మార్కెట్ రహదారులు కొనుగోలుదారులతో రద్దీగా మారాయి. పది రోజులుగా నిర్వహిస్తున్న దేవీ నవరాత్రి ఉత్సవాల అనంతరం విజయదశమి రోజు దసరా పండుగను అన్నివర్గాల ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకోవడం ఆనవాయితీ. ఈ సందర్భంగా ఆయుధపూజ, వాహనాల పూజలు నిర్వహించే సంప్రదాయం ఉండటంతో పూలు, పండ్లు, గుమ్మడి కాయలు, మామిడాకులు నూతన దుస్తులు కొనుగోలుతో దుకాణాలు కిటకిటలాడాయి.

వనపర్తిలో..

వనపర్తి పట్టణంలోని ప్రధాన వీధులలో చిరు వ్యాపారుల వద్ద పూలతో పాటు పండగకు అవసరమైన ఇతర సామాగ్రి కొనడానికి ప్రజలు ఆసక్తి చూపారు. చిన్న దుకాణం నుంచి పెద్ద షాపింగ్ మాల్స్ జనంతో కిక్కిరిసిపోయాయి. దసరా ఉత్సవాల కోసం జిల్లా కేంద్రంలోని నల్లచెరువు కట్టవద్ద ఉన్న శమీ చెట్టుకు నేడు ప్రత్యేక పూజలు చేయనున్న నేపథ్యంలో ఆ ప్రాంతమంతా శుభ్రం చేసి ఏర్పాట్లు పూర్తి చేశారు.



గద్వాల పట్టణంలోని ప్రధాన మార్కెట్ రోడ్డులో మామిడాకులు, పూజా సామగ్రిని కొనుగోలు చేస్తున్న ప్రజలు



వనపర్తి పట్టణంలో బంతిపూలు కొంటున్న వినియోగదారులు



నాగర్‌కర్నూల్ పట్టణంలోని కేసరిసముద్రం ట్యాంక్‌బండ్‌ను విద్యుద్దీపాలతో ముస్తాబు చేసిన ఉత్సవ నిర్వాహకులు

టీడీపీ హయాంలోనే ఆలయ పునర్నిర్మాణం

- జోగుళాంబకు పట్టు వస్త్రాలు సమర్పించిన మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు 3







బాకీ కార్డుతో ప్రజల్లోకి వెళ్లాలి : మాజీ మంత్రి

వనపర్తి, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో విఫలమైన కాంగ్రెస్ ప్రభుత్వంపై బాకీ కార్డుతో ప్రజల్లోకి వెళ్లాలని మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి అన్నారు. బుధవారం వనపర్తి పట్టణంలోని ఆయన నివాసంలో పార్టీ పట్టణ ముఖ్య నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పట్టణ నాయకులు కాంగ్రెస్ పార్టీ బాకీ కార్డుతో గ్రామాలలోకి వెళ్లి ప్రభుత్వ తీరును ఎండగట్టాలన్నారు. ఓట్ల కోసం ప్రజల వద్దకు వెళ్లిన నాయకులపై తిరగబడేలా ప్రచారం చేయాలన్నారు. పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం ప్రతీ నాయకుడు, కార్యకర్త కష్టపడి పని చేయాలని సూచించారు. సమావేశంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు గట్టు యాదవ్, నాయకులు వాకిటి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

స్వదేశీ ఉద్యమంలో భాగస్వాములు కావాలి



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర కార్యదర్శి భరత్‌ప్రసాద్

గద్వాల టౌన్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి) : ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించిన స్వదేశీ ఉద్యమంలో ప్రతీ ఒక్కరు భాగస్వాములు కావాలని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి భరత్‌ప్రసాద్ పిలుపునిచ్చారు. విదేశీ వస్తువులపై ఆధారపడే విధానానికి వీలైనంత త్వరగా ముగింపు పలకడమే ప్రధాని ముఖ్య ఉద్దేశమన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన సేవాపక్షం కార్యక్రమాల్లో భాగంగా బుధవారం గద్వాలలోని డీకే బంగ్లాలో విద్యావంతులు, మేధావుల సదస్సు నిర్వహించారు. సదస్సులో మాట్లాడిన భరత్ ప్రసాద్, ప్రజల కొనుగోలు శక్తిని పెంచడం, స్థానిక ఉత్పత్తులకు మార్కెట్ కల్పించడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ పన్నుల స్లాబ్‌లను ఐదు నుంచి రెండింటికి తగ్గించిందని తెలిపారు. ఈ నిర్ణయం వల్ల ప్రజలకు కలుగుతున్న ఆర్థిక ప్రయోజనాన్ని ప్రజలకు వివరించాలని పార్టీ శ్రేణులను కోరారు. సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు బండల వెంకట్రాములు, అక్కల రమాదేవి, స్థానిక ఎన్నికల ఇన్‌చార్జి రామచంద్రా రెడ్డి, ప్రధాన కార్యదర్శి శ్యాంరావు, తదితరులు పాల్గొన్నారు.






మహబూబ్‌నగర్ వాసవీ కన్యకా పరమేశ్వరీ ఆలయంలో మహిషాసురమర్దినిగా అమ్మవారు


పేట బ్రాహ్మణవాడి చౌడేశ్వరి ఆలయంలో మహిషాసుర మర్దినిగా అలంకరణ


అచ్చంపేటలోని భ్రమరాంబికాదేవి ఆలయంలో మహిషాసురమర్దినిగా పూజలందుకున్న అమ్మవారు


అలంపూర్ క్షేత్రంలో నిజరూపమైన జోగుళాంబ దేవిగా భక్తులకు దర్శనమిచ్చిన అమ్మవారు


ఆత్మకూరు పట్టణ కేంద్రంలోని వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో మహిషాసుర మర్దిని అవతారంలో అమ్మవారు


జడ్చర్లలోని వాసవీ కన్యకా పరమేశ్వరి దేవాలయంలో మారెమ్మ అవతారంతో దర్శనమిస్తున్న అమ్మవారు

జయ జయ హే మహిషాసురమర్దిని

శరన్నవరాత్రి వేడుకలు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వైభవంగా కొనసాగుతున్నాయి. చివరి రోజు బుధవారం ప్రధాన ఆలయాల్లో అమ్మవారు మహిషాసురమర్దినిగా భక్తుల పూజలందుకున్నారు. అలంపూర్ క్షేత్రంలోని అమ్మవారు జోగులాంబగానే దర్శనమిచ్చారు. - నెట్‌వర్క్, ఆంధ్రజ్యోతి

రాష్ట్ర ప్రజలకు దసరా శుభాకాంక్షలు

▸ పర్యాటక శాఖ మంత్రి జూపల్లి

హైదరాబాద్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రజలకు పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు విజయదశమి (దసరా) శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రజలందరూ భక్తిశ్రద్ధలతో శరన్నవరాత్రి వేడుకలను ఆనందంగా జరుపుకున్నారని పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా బతుకమ్మ సంబురాలు అంబరాన్ని అంటా యని తెలిపారు. ప్రజా సంక్షేమం, రాష్ట్ర ప్రగతే ధ్యేయంగా శ్రమి స్తున్న ప్రజా ప్రభుత్వానికి ప్రజల మద్దతు, దుర్గమ్మ ఆశీస్సులు లభించాలని కోరుకుంటున్నట్టు తెలిపారు.

'సంగంబండ' గేట్ల మూసివేత

మక్తల్ రూరల్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి) : నారాయణపేట జిల్లా, మక్తల్ మండలంలోని సంగంబండ జలాశయం గేట్లను బుధవారం మూసివేశారు. మంగళవారం వరకు ఒక గేటు ద్వారా నీటి విడుదల కొనసాగింది. పెద్ద వాగుకు ఎగువ నుంచి వరద ఉధృతి తగ్గడంతో బుధవారం ఆ గేటును మూసివేశారు. జలాశయం పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 3.313 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 2.65 టీఎంసీల నీరు నిల్వ ఉందని డీఈఈ సురేశ్ తెలిపారు.

ప్రజల ప్రాణాలతో చెలగాటమాడొద్దు

▸ జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రవినాయక్

▸ యన్మన్‌బెట్లలో ఆర్‌ఎంపీ దావాఖాన సీజ్


యన్మన్‌బెట్ల గ్రామంలో అనుమతులు లేని ఆర్‌ఎంపీ దావఖానా సీజ్ చేస్తున్న జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ రవి నాయక్

కొల్లాపూర్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి) : వైద్యం పేరుతో ప్రజల ప్రాణాలతో చెలగాటమాడితే చూస్తూ సహించేది లేదని, కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రవి నాయక్ హెచ్చరించారు. నాగర్‌కర్నూల్ జిల్లా, కొల్లాపూర్ మండల పరిధిలోని యన్మన్‌బెట్లలో అనుమతి లేకుండా నిర్వహిస్తున్న ప్రాథమిక చికిత్సా కేంద్రాన్ని బుధవారం తనిఖీ చేశారు. ఆర్‌ఎంపీ వినోద్‌ను విచారించి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ప్రాథమిక చికిత్సా కేంద్రాన్ని సీజ్ చేశారు. ఆయన వెంట జిల్లా మాస్ మీడియా డిప్యూటీ అధికారి రాజగోపాలాచారి, సబ్ యూనిట్ అధికారి కిషోర్ ఉన్నారు.

నేటి నుంచి 'గుట్టమీది' జాతర

▸ ఏర్పాట్లు పూర్తి చేసిన నిర్వాహకులు


లక్ష్మీపూర్ గుట్టపై వేంకటేశ్వరస్వామి మూలవిరాట్

నారాయణపేట రూరల్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లక్ష్మీపూర్ గుట్టపై దసరా సందర్భంగా జాతర జరగనుంది. విజయదశమితో పాటు మరుసటి రోజు వరకు ఘనంగా నిర్వహిస్తారు. గురువారం ఉదయం గ్రామంలో నుంచి గుట్టపైకి జల్దిబిందెను తీసుకెళ్లి స్వామివారికి అభిషేకం నిర్వహిస్తారు. అనంతరం స్వామివారికి పుష్పాలంకరణ తదితర ప్రత్యేక పూజలు చేస్తారు. సాయంత్రం ఉత్సవాలు ప్రారంభమవుతాయి. శుక్రవారం తెల్లవారు జామున స్వామివారి రథోత్సవం నిర్వహిస్తారు. అనంతరం రెట్టపట్ల కార్యక్రమం నిర్వహించి, గెలిచిన వారికి టెంకాయ, వెండి కడియం బహుమతులను నిర్వాహకులు అందజేస్తారు. జాతరలో భక్తుల కోసం గుట్టపైకి ప్రత్యేక రహదారితో పాటు వసతులు ముందస్తుగానే ఏర్పాటు చేశారు.

యోగాసనాల పోటీల్లో వనజారెడ్డి ప్రతిభ



జాతీయ స్థాయి యోగాసన పోటీల్లో పతకాలు సాధించిన వనజారెడ్డి

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి) : యోగాసనాల పోటీలో మహబూబ్‌నగర్ పట్టణానికి చెందిన క్రీడాకారిణి వనజారెడ్డి ప్రతిభ చాటుకున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని విజయవాడలో బుధవారం నిర్వహించిన 6వ జూనియర్, సీనియర్-సీ నేషనల్ యోగా స్పోర్ట్స్ చాంపియన్‌షిప్, ట్విస్టింగ్ విభాగంలో ఆమె బంగారు, ఫార్వర్డ్ బెండింగ్ విభాగంలో కాంస్య పతకాలు సాధించారు.

కష్టపడి పని చేయాలి

● బదిలీ సన్మాన సమావేశంలో ఎస్పీ యోగేష్ గౌతమ్


ఎస్పీని ఘనంగా సన్మానిస్తున్న డీఎస్పీ, పోలీసు సిబ్బంది

నారాయణపేట టౌన్, అక్టోబరు 1, (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ జీవితంలో బదిలీలు సర్వసాధారణమని, మనం ఎక్కడ ఉన్నా ఎలాంటి విధులు నిర్వర్తించినా కష్టపడి పని చేయాలని నారాయణపేట ఎస్పీ యోగేష్‌గౌతమ్ అన్నారు. ఎస్పీ సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోని రాజేంద్రనగర్ డీసీపీగా ఇటీవల బదిలీ అయ్యారు. ఎస్పీ కార్యాలయ కాన్ఫరెన్స్ హాల్‌లో బుధవారం బదిలీ సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీస్ ఉద్యోగం ఎంతో బాధ్యతాయుతమైనదని అన్నారు. అందుకు అనుగుణంగా పనిచేయాలని, ప్రజల మన్ననలు పొందాలని చెప్పారు. జిల్లా నుంచి తాను చాలా విషయాలు నేర్చుకున్నానని అన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ సిక్తా పట్నాయక్, అదనపు కలెక్టర్ శ్రీను, శిక్షణ కలెక్టర్ ప్రణయ్, అదనపు ఎస్పీ ఎండీ రియాజ్, డీఎస్పీ నల్లపు లింగయ్య, ఎస్‌ఐలు, జిల్లా పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మాజీ మంత్రి సి.లక్ష్మారెడ్డికి మాతృవియోగం


మాజీ మంత్రి లక్ష్మారెడ్డి తల్లి లక్ష్మమ్మ పార్థివదేహంపై పూలమాల ఉంచి నివాళులు అర్పిస్తున్న బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు


లక్ష్మమ్మ పార్థివ దేహంపై పూలమాల ఉంచి నివాళి అర్పిస్తున్న జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి

▸ నివాళులు అర్పించిన బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్


మాజీ మంత్రి లక్ష్మారెడ్డి తల్లి లక్ష్మమ్మ (ఫైల్)

జడ్చర్ల, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి) : మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ పార్టీ మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ సి. లక్ష్మారెడ్డి మాతృమూర్తి చెర్లకోల లక్ష్మమ్మ(90) మృతి చెందారు. హైదరాబాద్‌లోని అప్పా జంక్షన్ సమీపంలో, ఆరె మైసమ్మ దేవాలయానికి వెళ్లే దారిలోని మాజీ మంత్రి స్వగృహంలో బుధవారం ఉదయం ఆమె కన్నుమూశారు. ఇటీవల అస్వస్థతకు గురైన ఆమె అనారోగ్యంతో పాటు వృద్ధాప్యం కారణంగా చివరి శ్వాస విడిచారు. విషయం తెలుసుకున్న బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు లక్ష్మారెడ్డి స్వగృహానికి వెళ్లి పరామర్శించారు. లక్ష్మమ్మ పార్థివదేహంపై పూలమాల ఉంచి నివాళి అర్పించారు. మనోధైర్యంతో ఉండాలని లక్ష్మారెడ్డికి సూచించారు. పరామర్శించిన వారిలో ఎమ్మెల్సీ వెంకట్రామ్‌రెడ్డి, మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ఉన్నారు.

లక్ష్మమ్మ అంత్యక్రియలను ఈ నెల 3న నాగర్‌కర్నూల్ జిల్లా, తిమ్మాజీపేట మండలంలోని ఆవంచలో నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

అలాగే మాజీ మంత్రి లక్ష్మారెడ్డిని జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి పరామర్శించారు. హైదరాబాద్‌లోని ఆయన గృహానికి వెళ్లి, లక్ష్మమ్మ పార్థివదేహంపై పూలమాల ఉంచి నివాళి అర్పించారు. పరామర్శించిన వారిలో మాజీ ఎమ్మెల్యేలు ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, మర్రి జనార్దన్‌రెడ్డి, జైపాల్‌యాదవ్, రావుల చంద్రశేఖర్‌రెడ్డిలతో పాటు బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

కుటుంబ వ్యవస్థను బలోపేతం చేద్దాం



ఆవిర్భావ వేడుకల్లో మాట్లాడుతున్న అఖిల భారతీయ వీహెచ్‌పీ సహ సంఘటన మంత్రి దేవేందర్

కొత్తకోట, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): దేశంలో కుటుంబ వ్యవస్థను బలోపేతం చేద్దామని అఖిల భారతీయ హిందూ వాహిని సహ సంఘటన మంత్రి దేవేందర్ అన్నారు. బుధవారం రాత్రి వనపర్తి జిల్లా కొత్తకోట పట్టణంలోని బీపీఆర్ గార్డెన్‌లో ఆర్‌ఎస్‌ఎస్ వందేళ్ల ఆవిర్భావ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా దేవేందర్ మాట్లాడుతూ ఆర్‌ఎస్సెస్ వందేళ్ల ప్రస్థానంలో దేశ వ్యాప్తంగా 80 వేల శాఖలను నిర్వహిస్తుందన్నారు. రానున్న రోజుల్లో ఈ సంఖ్యను లక్షలకు విస్తరించడమే లక్ష్యమన్నారు. అనేక హిందూ ధార్మిక సంఘాలను ఏకం చేసే పనిలో ఉన్నామన్నారు. ప్రకృతిని ఆరాధించి చెట్లను కాపాడడం, జలాలను రక్షించడంపై దృష్టి పెట్టడం జరుగుతుందన్నారు. స్వదేశీ విధానంపై ప్రజలకు అవగాహన కల్పించి దేశీయ ఉత్పత్తుల పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకొస్తామన్నారు.

పౌర హక్కులకు రక్షణ కల్పించడానికి కృషి చేస్తామని వివరించారు. ఆర్‌ఎస్సెస్ నాయకులు మురళీధర్‌రెడ్డి, శ్యాంసుందర్‌రెడ్డి, చంద్రశేఖర్, బీమరాజు, భరత్ భూషణ్, బీమా రవి తదితరులు పాల్గొన్నారు.

రెండు వాహనాలు ఢీ

▸ ఏడుగురికి తీవ్ర గాయాలు


తుఫాన్ ఢీకొని నుజ్జు నుజ్జు అయిన ఫోర్డ్ కారు

కృష్ణ, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి) : రెండు వాహనాలు (తుఫాన్, కారు) ఎదురెదురుగా వస్తూ ఢీకొనడంతో 7గురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ సంఘటన నారాయణపేట జిల్లా, మాగనూరు మండల పరిధిలో బుధవారం తెల్లవారుజామున జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లా కేంద్రానికి చెందిన వారు కారులో రాయిచూరుకు పోయి తిరిగి వస్తున్నారు. హైదరాబాద్ నుంచి ఓ కుటుంబం కర్ణాటక రాష్ట్రంలోని సింధనూరుకు తుఫాన్ వాహనంలో వెళ్తున్నారు. రెండు వాహనాలు ఎదురుగా వస్తూ నల్లగట్టు సమీపంలో ఢీకొన్నాయి. ప్రమాదంలో కారులో ఉన్న ముగ్గురు, తుఫాన్‌లో ఉన్న నలుగురు తీవ్రంగా గాయపడ్డారు.

సంఘటనపై స్థానికులు సమాచారం అందించడంతో పోలీసులు వెంటనే అక్కడికి చేరుకున్నారు. క్షతగాత్రులను మక్తల్ ప్రభుత్వం ఆసుపత్రికి తరలించారు. ఇద్దరి పరిస్థితి విషమంగా ఉండటంతో, మహబూబ్‌నగర్ జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ అశోక్ బాబు తెలిపారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉందన్నారు.

వనపర్తికి కేంద్రీయ విద్యాలయం మంజూరు

● ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

వనపర్తి టౌన్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి కేంద్రీయ విద్యాలయం వనపర్తిలో నెలకొల్పడానికి కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపిందని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే వనపర్తి విద్యాపర్తిగా వెలుగొందుతోందని, నేడు కేంద్రీయ విద్యాలయం మంజూరుతో వనపర్తి కీర్తి ప్రతిష్టలు మరింత పెరుగుతాయన్నారు. జిల్లా ప్రజల అభ్యర్థన మేరకు స్పందించిన కేంద్ర ప్రభుత్వం వనపర్తి జిల్లా కేంద్రానికి కేంద్రీయ విద్యాలయాన్ని మంజూరు చేస్తూ బుధవారం కేంద్ర కేబినెట్ ఆమోద ముద్ర వేయడం గర్వించదగిన విషయమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. విద్యాపర్తిగా పేరుగాంచిన వనపర్తి కేంద్రీయ విద్యాలయం మంజూరుతో జాతీయ స్థాయిలోను గుర్తింపు పొందుతుందని ఆనందం వ్యక్తం చేశారు. కేంద్రీయ విద్యాలయం మంజూరు కోసం సహకరించిన జిల్లా ఇన్‌చార్జి మంత్రి దామోదర రాజనర్సింహ, జిల్లా మంత్రులు వాకిటి శ్రీహరి, జూపల్లి కృష్ణారావు, ఎంపీ మల్లు రవి, కలెక్టర్ ఆదర్శ్ సురభికి ఎమ్మెల్యే ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ఎన్నికల సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

- శిక్షణ కలెక్టర్ ప్రణయ్‌కుమార్


ఎన్నికల సిబ్బంది శిక్షణ కేంద్రం వద్ద అధికారులతో శిక్షణ కలెక్టర్ ప్రణయ్‌కుమార్

ఊట్కూర్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ సజావుగా ప్రక్రియ పూర్తయ్యేలా చూడాలని శిక్షణ కలెక్టర్ ప్రణయ్‌కుమార్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల కోసం పీఓ, ఏపీఓలకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి హాజరై పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లో పీఓలు పాటించాల్సిన నిబంధనలు వివరించారు. ఆయన మాట్లాడుతూ సిబ్బందికి ఏవైనా సమస్యలు తలెత్తినప్పుడు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలన్నారు. మండలంలోని పోలింగ్ కేంద్రాల్లో వసతులు కల్పించాలన్నారు. కార్యక్రమంలో టీటీలు గోపాల్, బస్వేష్, సత్యపాల్, పీఓ, ఏపీఓలకు స్థానిక సంస్థల ఎన్నిలపై శిక్షణ ఇచ్చారు.

నేటి నుంచి ఉర్సు



సమావేశంలో మాట్లాడుతున్న ఉర్సు నిర్వాహకులు

నారాయణపేట టౌన్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని హజ్రత్ సయ్యద్ షా మహమ్మద్ తఖీ సబ్జ్‌పోష్ ఖాద్రీ రహ దర్గాలో నాలుగు రోజుల పాటు జరిగే ఉర్సు గురువారం నుంచి ప్రారంభమవుతున్నట్లు తఖీబాబా రహ సజ్జాదనషీన్ సయ్యద్ షా గియాసుద్దీన్ ఖాద్రీ బుధవారం తెలిపారు. గురువారం జామియా మసీదు వద్ద పతాకా ఊరేగింపు, శుక్రవారం గంధం ఊరేగింపుకు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమాన్ని సయ్యద్ మహ్మద్ తఖీ రాబియ్ నిర్వహిస్తారని తెలిపారు. శనివారం దర్గా ఆవరణలో మహిఫిల్ ఏ నాత్ జరుగుతుందన్నారు. ఆదివారం జియారత్ మహాసభ ఉంటుందని, ముఖ్య అతిథిగా హైదరాబాద్ నుంచి మౌలానా సయ్యద్ షా అజీజుల్లా ఖాద్రీ హాజరవుతున్నట్లు పేర్కొన్నారు.

బాధిత కుటుంబానికి మంత్రి పరామర్శ


కాంగ్రెస్ నాయకుడు నారాయణరెడ్డిని ఓదారుస్తున్న మంత్రి వాకిటి శ్రీహరి

ఊట్కూర్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని నిడుగుర్తికి చెందిన కాంగ్రెస్ నాయకుడు నారాయణరెడ్డి కుమారుడు భరత్‌రెడ్డి అనారోగ్యంతో చికిత్స పొందుతూ మృతి చెందాడు. విషయం తెలుసుకున్నా మంత్రి వాకిటి శ్రీహరి బుధవారం గ్రామానికి చేరుకుని భరత్‌రెడ్డి మృతదేహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. నారాయణరెడ్డి కుటుంబ సభ్యులను కలిసి ఓదార్చారు. మంత్రి వెంట సూర్యప్రకాష్ రెడ్డి, కృష్ణార్జున్‌రెడ్డి, దుర్గం శ్రీనివాస్, కోరం మహేశ్వర్‌రెడ్డి, లింగం, నాయకు లు ఉన్నారు.

మద్యం టెండర్లకు బోణీ


జిల్లా కేంద్రంలోని ఈఎస్ ఆఫీస్‌లో మద్యం దుకాణాలకు టెండర్లు వేస్తున్న వ్యాపారి

మహబూబ్‌నగర్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి) : మద్యం దుకాణాల టెండర్ల ప్రక్రియను ప్రభుత్వం గత నెల 25న ప్రారంభించింది. మహబూబ్‌నగర్, నారాయణపేట జిల్లాల పరిధిలో బుధవారం టెండర్ల ప్రక్రియ మొదలయ్యింది. బుధవారం జిల్లా కేంద్రంలోని ఎక్సైజ్ కార్యాలయంలో బుధవారం 5 దుకాణాలకు వ్యాపారులు ఒక్కో టెండరు దాఖలు చేశారు. టెండర్ పత్రాలను సూపరింటెండెంట్ విజయభాస్కర్‌గౌడ్‌కు అందించారు. కోయిలకొండ, అడ్డాకుల, భూత్పూర్, అడ్డాకుల, మూసాపేటలతో పాటు, నారాయణపేట జిల్లాలోని మరికల్ దుకాణాలకు వ్యాపారులు టెండర్లు దాఖలు చేశారు. ఒకే వ్యాపారి మూడు షాపులకు టెండరు దాఖలు చేసినట్లు అధికారులు తెలిపారు.

క్రైం కార్నర్

గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం

దేవరకద్ర, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి) : వరదలో కొట్టుకుపోయిన వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు దేవరకద్ర ఎస్‌ఐ నాగన్న తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. అడ్డాకుల మండలం శాఖాపూర్ గ్రామానికి చెందిన రమే శ్ (26) అనే వ్యక్తి, ఇన్రంపల్లి గ్రామానికి చెందిన అలివేలమ్మతో కలిసి కౌకుం ట్లకు బయలుదేరాడు. రెండు గ్రామాల మధ్య ఉన్న వాగులో వరద ఉధృతికి ఇద్దరూ కొట్టుకుపోగా, అలివేలమ్మ ఓ చెట్టును పట్టుకొని ప్రాణాలను కాపాడు కున్నది. గ్రామస్థులు గమనించి ఆమెను ఒడ్డుకు తీసుకొచ్చారు. రమేశ్ దొరకక పోవడంతో అధికారులు గజ ఈతగాళ్లతో వెతికించినా ఫలితం లేకపోయింది. బుధవారం మరో సారి గాలించగా, అతడి మృతదేహం లభ్యమైనట్లు ఎస్‌ఐ తెలిపారు.

అదృశ్యమైన యువకుడు...

జడ్చర్ల, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి) : అదృశ్యమైన యువకుడి మృతదేహం లభ్యమైంది. మహబూబ్‌నగర్ జిల్లా, జడ్చర్ల మండలంలోని మల్లెబోయిన్‌పల్లి సమీపంలో ఈ సంఘటన జరిగింది. సీఐ కమలాకర్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మల్లెబోయిన్‌పల్లి గ్రామానికి చెందిన రాంచరణ్ (19) ఈనెల 25న అదృశ్యమయ్యాడు. ఈ విషయంపై తల్లి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. ఈ నేపథ్యంలో గ్రామ సమీపంలోని సింగాయకుంటలో ఓ యువకుడి మృతదేహం ఉన్నట్లు పోలీసులకు సమాచారం అందింది. వెళ్లి పరిశీలించి, మృతి చెందినది రాంచరణ్‌కు గుర్తించారు. మృతదేహాన్ని జడ్చర్ల ఏరియా ఆసుపత్రికి తరలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

కదులుతున్న బస్సులో కండక్టర్‌కు గుండె పోటు

గండీడ్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి) : కదులుతున్న ఆర్టీసీ బస్సులో విధులు నిర్వర్తిస్తున్న కండక్టర్‌కు గుండెపోటు వచ్చింది. ఈ సంఘటన మహబూబ్‌నగర్ జిల్లా, గండీడ్ మండల పరిధిలోని రంగారెడ్డిపల్లి గేటు వద్ద జరిగింది. ప్రయాణికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. తాండూరు డిపోకు చెందిన బస్సు మహబూబ్‌నగర్ నుంచి తాండూరుకు వెళ్తుండగా, విధుల్లో ఉన్న కండక్టర్ సురేశ్‌కు అకస్మాత్తుగా గుండెపోటు వచ్చింది. బస్సులోని ప్రయాణికులు గమనించి 108కు అంబులెన్సుకు సమాచారం అందించారు. దీంతో 108 పైలట్ జానకమ్మ, డ్రైవర్ చాంద్‌పాషా వెంటనే అక్కడికి చేరుకున్నారు. సురేశ్‌ను మహబూబ్‌నగర్ జిల్లా ప్రధాన ఆసుపత్రికి తరలించారు. అతడి ఆరోగ్య పరిస్థితి వివరాలు తెలియాల్సి ఉన్నది.

వ్యక్తి అదృశ్యం, కేసు నమోదు


మధురాజు పర్వతాలు (ఫైల్)

నాగర్‌కర్నూల్ క్రైం, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా, నాగర్‌కర్నూల్ మండలంలోని గుడిపల్లి గ్రామానికి చెందిన మధురాజు పర్వతాలు (40) అదృశ్యమయ్యాడు. ఎస్‌ఐ గోవర్ధన్ బుధవారం తెలిపిన వివరాల ప్రకారం.. మధురాజు పర్వతాలు సెప్టెంబరు 29న అర్ధరాత్రి ఇంట్లో ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయాడు. భార్య కవిత తెల్లవారుజామున లేచి చూడగా అతడు కనిపించలేదు. చుట్టుపక్కల, బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించలేదు. అతడికి ఫోన్ చేస్తే స్విచ్ ఆఫ్ చేసి ఉంది. దీంతో ఆమె బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ గోవర్ధన్ తెలిపారు. పర్వతాలుకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు.

బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలి

- విద్యుదాఘాతంతో యువకుడి మృతి
- రాస్తారోకో చేపట్టిన కుటుంబ సభ్యులు


కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న అధికారులు

పాన్‌గల్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి) : న్యాయం చేయాలని కోరుతూ బాధిత కుటుంబ సభ్యులు ఆందోళన చేపట్టారు. వనపర్తి జిల్లా, పాన్‌గల్ మండల కేంద్రానికి మధుసూదన్ యాదవ్ విద్యుత్ శాఖలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగిగా పని చేస్తున్నారు. మంగళవారం ట్రాన్స్‌ఫార్మర్‌ను పరిశీలించేందుకు వెళ్లి విద్యుదాఘాతంతో మృతి చెందాడు. తమను ఆదుకోవాలని కోరుతూ బాధిత కుటుంబ సభ్యులు బుధవారం పాన్‌గల్ పోలీస్‌స్టేషన్ సమీపంలో రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ లైన్‌మాన్ నిర్లక్ష్యం వల్లే తమ కుటుంబానికి పెద్ద దిక్కయిన మధుసూదన్ మృతి చెందాడని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ శాఖ అధికారులు వచ్చి స్పష్టమైన హామీ ఇచ్చేంత వరకు ఆందోళన విరమించేది లేదని స్పష్టం చేశారు. రాస్తారోకోతో వాహనాలు అధిక సంఖ్యలో నిలిచిపోవడంతో వనపర్తి సీఐ కృష్ణ అక్కడికి చేరుకున్నారు. ఆందోళనకారులను స్టేషన్ ఆవరణలోకి తీసుకెళ్లి మాట్లాడారు. బాధిత కుటుంబానికి నష్టపరిహారం ఇస్తామని విద్యుత్ శాఖ అధికారులు హామీ ఇవ్వడంతో వారు అంగీకరించారు.

డీసీఎంను ఢీకొన్న బుల్లెట్ బైక్

- అనంతపురం జిల్లా యువకుడి మృతి
- పండుగ కోసం స్వగ్రామానికి వెళ్తుండగా ప్రమాదం


పవన్‌సాయి నవీన్‌కుమార్ (ఫైల్)

మూసాపేట, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్‌లో ఉద్యోగం చేస్తున్న ఏపీలోని అనంతపురం జిల్లాకు చెందిన యువకుడు దసరా పండుగ కోసం సొంతూరికి వెళ్తూ రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. మహబూబ్‌నగర్ జిల్లాలోని శాఖాపూర్ వద్ద బుధవారం ఈ సంఘటన జరిగింది. మూసాపేట ఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అనంతపురం జిల్లా, కమలపాడుకు చెందిన పవన్‌సాయి నవీన్‌కుమార్ (34) కొన్నేళ్లుగా హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పని చేస్తున్నాడు. దసరా పండుగను కుటుంబ సభ్యులతో కలిసి జరుపుకునేందుకు బుధవారం తెల్లవారుజామున హైదరాబాద్ నుంచి రాయల్ ఎన్‌ఫీల్డ్ బుల్లెట్ బైకుపై స్వగ్రామానికి బయలు దేరాడు. మధ్యాహ్నం 44వ జాతీయ రహదారిపై శాఖాపూర్ స్టేజీ సమీపంలో ఆగిఉన్న డీసీఎంను వెనుక నుంచి బలంగా ఢీకొన్నాడు. దీంతో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. నవీన్‌కుమార్ చిన్నతనంలోనే తల్లి మృతి చెందింది. తండ్రి దేవేంద్రప్ప ఏడాది క్రితం మృతి చెందాడు. సంఘటనపై మృతుడి చిన్నాయన హరినాథ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.


సంఘటనా స్థలంలో మృతుడు, ద్విచక్ర వాహనం

కోడ్ ఉల్లంఘిస్తే శిక్షార్హులు

- ఎన్నికల నియమావళిని పక్కాగా అమలు చేయాలి
- గ్రామాల్లో బెల్టు షాపులు మూసేయాలి
- కొత్త పనులను ప్రారంభించొద్దు
- ర్యాలీలు, సమావేశాలకు ముందస్తు అనుమతి తప్పని సరి
- ఎఫ్ఎస్‌టీ, ఎస్ఎస్‌టీ బృందాల నిరంతర పర్యవేక్షణ
- 'ఆంధ్రజ్యోతి'తో మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ నోడల్ అధికారి మధుసూదన్ నాయక్


ఎన్నికల నియమావళి నోడల్ ఆఫీసర్, జిల్లా అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

మహబూబ్‌నగర్ న్యూ టౌన్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం రెండు విడతల్లో ప్రాదేశిక ఎన్నికలు, మూడు విడతల్లో పంచాయతీ ఎన్నికలు నిర్వహించేందుకు నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ సందర్భంగా ఎన్నికల నియమావళి(కోడ్) అమల్లోకి వచ్చింది. ఈ కోడ్‌ను అధికారులు పక్కాగా అమలు చేయాలని, ఉల్లంఘిస్తే చట్ట ప్రకారం శిక్షార్హులవుతారని అంటున్నారు మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ నోడల్ అధికారి, జిల్లా అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్. అధికారులు రాజకీయ పార్టీల నాయకులు, ప్రజా ప్రతినిధుల వద్దకు వెళ్లొద్దని, అలా వెళ్తే ప్రభుత్వం సర్వీసు నుంచి తొలగిస్తుందని చెప్పారు. బుధవారం ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు.

ఎన్నికల నియమావళి అమల్లోకి రాగానే ఎలాంటి నిర్ణయాలు తీసుకుంటారు?

ముందుగా ప్రభుత్వ కార్యాలయాలలోని ప్రభుత్వ పథకాల పోస్టర్లు, ఫ్లెక్సీలను తొలగిస్తారు. గ్రామాలలో రాజకీయ పార్టీల జెండాలను, ఫ్లెక్సీలను తొలగిస్తాం. గోడలపై ఉన్న వాల్ పెయింటింగ్‌లను తుడి చేయిస్తాం.

ప్రభుత్వ పథకాల లబ్ధిదారులకు ఇబ్బందులు తలెత్తుతాయా?

ముందుగా లబ్ధి పొందిన వారికి ఎలాంటి ఇబ్బందులూ ఉండవు. వారికి ప్రభుత్వం ముందుగా నిర్ణయించినట్లుగానే పథకాల అమ లు ఉంటుంది. కొత్తగా లబ్ధిదారులను ఎంపిక చేయరు.

కొత్త పనులు చేపడతారా?

కొత్త పనులు చేపట్టడం, ప్రారంభించడానికి వీలు ఉండదు. గతంలో ప్రారంభించి, 70 శాతం మేర పూర్తయిన పనులనే కొనసాగించాలి.

అలా అని గతంలో ఎప్పుడో చేపట్టిన పనులను చేపట్టేందుకు వీలు లేదు. ఈ మేరకు అన్ని మండలాల తహసీల్దార్లు, ఎంపీడీవోలకు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ విజయేందిర బోయి ఆదేశం మేరకు ఉత్తర్వులు జారీ చేశాం.

రాజకీయ పార్టీలు సమావేశాలు, ఊరేగింపులు నిర్వహించుకోవాలంటే ఎలా?

ఎన్నికల కోడ్ అమలులో ఉన్నప్పుడు రాజకీయ పార్టీల నాయకులు సమావేశాలు, ఊరేగింపులు, చివరకు మైక్‌లో ప్రచారం చేసుకోవాలన్నా సంబంధిత ఎన్నికల అధికారి అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలి. ముందుగా అనుమతి తీసుకున్న వారికి ప్రాధాన్యం ఇస్తాం.

ఒక వ్యక్తి ఎంత నగదుతో ప్రయాణం చేయొచ్చు?

ఎన్నికల నియమావళి ప్రకారం ఒక వ్యక్తి రూ.50 వేలకు మించి తీసుకెళ్లొద్దు. అంతకంటే ఎక్కువ డబ్బుతో ప్రయాణాలు చేస్తే అధికారులు స్వాధీనం చేసుకుని, డిపాజిట్ చేస్తారు. ఎన్నికల అనంతరం ఆ వ్యక్తి నగదుకు సరైన లెక్కలు చూపిస్తే తిరిగి ఇస్తారు. లేదంటే ప్రభుత్వ ఖజానాలో జమ చేస్తారు.

గ్రామాలలో మద్యాన్ని నిలువరించేందుకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

గ్రామాలలోని అన్ని బెల్టు షాపులను మూసి వేయాలని ఎక్సైజ్, పోలీస్ అధికారులను ఆదేశించాం.

ఎన్నికల కోడ్ అమలు కోసం అధికారులను ఏర్పాటు చేశారా?

ఎన్నికల కోడ్‌ను పక్కాగా అమలు చేసేందుకు జిల్లాలో ఫ్లయింగ్ సర్వేలైన్ బృందాలను (ఎఫ్ఎస్‌టీ), స్టాటిక్ సర్వేలైన్ బృందాలను ఏర్పాటు చేశాం. ఫ్లయింగ్, సర్వేలైన్ బృందాలు జిల్లాలో నిరంతరం పర్యవేక్షణ చేస్తాయి. నగదు, మద్యం తదితరాలు ఏమైనా పట్టుపడితే కేసులు నమోదు చేస్తారు. జిల్లా సరిహద్దులతో పాటు, ఇతర ప్రాంతాలలో చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి, వాహనాలను తనిఖీ చేస్తారు. అక్రమంగా వచ్చే నగదును, మద్యాన్ని స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేస్తారు.

ఫుట్‌బాల్ చాంపియన్‌గా వనపర్తి జట్టు

- అభినందించిన కలెక్టర్ ఆదర్శ్ సురభి


కలెక్టర్‌తో కలిసి బహుమతిని ప్రదర్శిస్తున్న ఫుట్‌బాల్ క్రీడాకారులు

వనపర్తి రాజీవ్ చౌరస్తా,అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో జరిగిన సీనియర్ మెన్స్ ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీల్లో వనపర్తి జట్టు విజేతగా నిలిచింది. జట్టు క్రీడాకారులు బుధవారం కలెక్టర్ ఆదర్శ్ సురభిని ఆయన చాంబర్లో కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్ వారిని అభినందించారు. కార్యక్రమంలో డీవైఎస్‌ఓ సుధీర్ కుమార్‌రెడ్డి, ఫుట్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు శ్రీకృష్ణకుమార్‌రెడ్డి, ఉపాధ్యక్షులు సురేందర్ రెడ్డి, వెంకట్, ప్రధాన కార్యదర్శి నందిమల్ల తిరుపతి, కోశాధికారి కోచ్ రాజేందర్ పాల్గొన్నారు.

దసరా వేడుకల్లో రాజకీయ సందడి

- సొంత ఊర్లకు చేరుకున్న గ్రామస్థులు
- వారి మద్దతు కోసం నాయకుల తంటాలు
- కోర్టు తీర్పుపై లోలోన ఆందోళన

మహబూబ్‌నగర్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి) : దసరా ఉత్సవాల వేళ గ్రామాల్లో ఎన్నికల సందడి నెలకొన్నది. పండగకు సరిగ్గా మూడు రోజుల ముందు రిజర్వేషన్లు ఖరారు కావడం, ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడంతో పల్లెల్లో రాజకీయం జోరందుకున్నది. వృత్తి, ఉద్యోగాలు, ఉన్నత చదువుల కోసం ఇతర పట్టణాల్లో ఉంటున్న వారందరూ పండుగ కోసం గ్రామాలకు చేరుకున్నారు. రాజకీయ నాయకులు వారిని పేరుపేరునా పలకరిస్తూ మచ్చిక చేసుకునే ప్రయత్నం చేస్తున్నారు. వారి మద్దతు కోసం తంటాలు పడుతున్నారు. ఎంపీటీసీ, జెడ్పీటీసీతో పాటు సర్పంచ్ ఎన్నికలు జరగనుండటంతో గ్రామాలు, మండలాలకు కేటాయించిన రిజర్వేషన్ల ఆధారంగా పోటీలో ఉండే అభ్యర్థులు ఇప్పటికే మద్దతుదారులకు విందులు ఏర్పాటు చేస్తున్నారు. దుర్గామాత మండపాల వద్ద అన్నదానం నిర్వహిస్తున్నారు. యువతీ యువకులను కలిసి మద్దతు కోరుతున్నారు. విలేజ్ వాట్సప్ గ్రూపుల్లో లీకులు ఇస్తూ ప్రజా నాడిని తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఫలానా అభ్యర్థి పోటీలో ఉంటున్నారంటూ ఫోటోలను పోస్టు చేసి చర్చలు కొనసాగిస్తున్నారు. విందులు, వినోదాలతో యువతను ఆకట్టుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. ఒకవైపు ప్రజల మద్దతు కూడగడుతూనే, మరో వైపు నియోజకవర్గ ముఖ్య నాయకుల వద్ద టికెట్ తమకే ఇవ్వాలని పైరవీలు చేసుకుంటున్నారు. యూరియా కొరత అంశాన్ని విపక్షాలు ఎన్నికల్లో ప్రధాన అస్త్రంగా చేసుకోవాలని భావిస్తుండగా, అధికార పక్షం మాత్రం సంక్షేమ పథకాలతో ముందుకెళ్ళే ప్రయత్నం చేస్తోంది. ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డులనే ప్రధాన అంశాలుగా చేసుకుని ప్రచారం చేసేందుకు సిద్ధం అవుతున్నాయి. ఇప్పటికే ద్వితీయ శ్రేణి నాయకులు కాంగ్రెస్ అభ్యర్థులు గెలిస్తేనే ఇందిరమ్మ ఇళ్లు, పింఛన్లు, రేషన్ కార్డులు వస్తాయంటూ ప్రచారం చేస్తున్నారు. అధికార పార్టీని గెలిపిస్తేనే ఊరు అభివృద్ధి చెందుతుందని చెప్తున్నారు.

కోర్టు తీర్పుపై ఉత్కంఠ

ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడంతో ఆశావహులు ఇప్పటికే ప్రచారంలో నిమగ్నమయ్యారు. అయితే 42 శాతం బీసీ రిజర్వేషన్లపై ఈ నెల 8న కోర్టు తీర్పు ఉండటంతో, అందరిలోనూ ఆందోళన నెలకొంది. ఒక వేళ కోర్టు తీర్పు వ్యతిరేకంగా వచ్చి, బీసీ రిజర్వేషన్‌లలో మార్పులు చేర్పులు జరిగితే తమ పరిస్థితి ఏమిటన్న భయం ఆశావహుల్లో వ్యక్తం అవుతోంది.

ఈ నేపథ్యంలో కొందరు అభ్యర్థులు మాత్రం 8వ తేదీ వరకు దూకుడు ప్రదర్శించకూడదని అనుకుంటుండగా, మరి కొందరు కోర్టు తీర్పును పట్టించుకోకుండా ఎన్నికల ప్రచారంలో మునిగి తేలుగుతున్నారు.

రోయింగ్ పోటీల్లో సత్తా చాటిన ఉపేంద్ర

- జాతీయ స్థాయికి ఎంపిక


జాతీయ స్థాయిలో రోయింగ్ (పడవ) పోటీకి ఎంపికైన యువకుడు ఉపేంద్ర

కృష్ణ, మాగనూరు, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి) : జాతీయ స్థాయి రోయింగ్ (పడవ) పోటీలకు నారాయణపేట జిల్లా, కృష్ణ మండలంలోని వాద్వాట్ గ్రామానికి చెందిన బాలుడు ఉపేంద్ర ఎంపికయ్యాడు. ప్రస్తుతం హైదరాబాద్, హకీంపేట క్రీడా పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న ఉపేంద్ర ఇటీవల హుస్సేన్‌సాగర్‌లో నిర్వహించిన అండర్-14 రోయింగ్ పోటీల్లో పాల్గొని ప్రథమ స్థానంలో నిలిచాడు. ఖేలో ఇండియా, జాతీయ స్థాయి రోయింగ్ (పడవ) పోటీలకు ఎంపికయ్యాడు. ఈనెల 11 నుంచి 17 వరకు కేరళ రాష్ట్రంలోని అళప్పుజ సరస్సులో నిర్వహించనున్న పోటీల్లో పాల్గొననున్నాడని పీఈటీ దీప తెలిపారు. ఉపేంద్ర ప్రస్తుతం రోయింగ్ కోచ్ హేమంత్ వద్ద శిక్షణ పొందుతున్నాడని చెప్పారు. తండ్రి తల్వార్ నరసింహ కూలీ పని చేస్తూ ఉపేంద్ర చదివిస్తున్నాడని తెలిపారు. బాలుడికి ఆర్థిక సహకారం అందిస్తున్న విశ్రాంత పీఈటీ గోపాలం, పీఈటీ దీపలకు నరసింహ కృతజ్ఞతలు తెలిపారు.


జాతీయ స్థాయి షూటింగ్ బాల్‌కు ఎంపికైన నర్వ విద్యార్థిని రాధమ్మ

షూటింగ్ బాల్ పోటీలకు నర్వ విద్యార్థి

నర్వ (ఆంధ్రజ్యోతి) : జాతీయ స్థాయి షూటింగ్ బాల్ పోటీలకు నర్వ మండల కేంద్రానికి చెందిన చింతచెట్టు లక్ష్మి, కృష్ణయ్య దంపతుల కుమార్తె రాధమ్మ ఎంపికయ్యింది. మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురులో గత నెల 22 నుంచి 24 వరకు జరిగిన 44వ జూనియర్ రాష్ట్ర స్థాయి షూటింగ్ బాల్ పోటీల్లో మహబూబ్‌నగర్ జిల్లా బాలికల జట్టు తరపున రాధమ్మ పాల్గొన్నారు. పోటీల్లో క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు షూటింగ్ బాల్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు గోపాలం తెలిపారు. నవంబర్ మొదటివారంలో ఉత్తరప్రదేశ్‌లోని ఘజియాబాద్‌లో నిర్వహించనున్న జాతీయ స్థాయి షూటింగ్ బాల్ పోటీల్లో పాల్గొననున్నట్లు చెప్పారు. విద్యార్థిని రాదమ్మను మాజీ ఉప సర్పంచ్ చింతచెట్టు రాములు, కొత్తపల్లి అశోక్, కావలి కృష్ణ తదితరులు అభినందించారు.

జీవించే హక్కును హరించడం రాజ్యాంగ వ్యతిరేకం

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు బాల నరసింహ

వనపర్తి టౌన్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): కేంద్ర హోం మంత్రి అమిత్ షా మవోయిస్టులను మార్చి 2026లోగా హతమారుస్తామని అనడం రాజ్యాంగ వ్యతిరేకమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు బాల నరసింహ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో జిల్లా కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాంగం జీవించే హక్కును ప్రతీ ఒక్కరికి కల్పించిందని, రాజ్యాంగబద్ధ పదవిలో కొనసాగుతున్న అమిత్ షా ఇలాంటి వ్యాఖ్యలు చేయడం నియంత ధోరణికి నిదర్శనమన్నారు. కాల్పుల విరమణ చేసి చర్చలు జరపాలని ఎంతో కాలంగా మావోయిస్టులు కోరుతున్నా పెడచెవిన పెట్టడం సరికాదన్నారు.

5 జడ్పీటీసీ, 15 ఎంపీటీసీ స్థానాలకు పోటీ...

జిల్లాలో 5 జడ్పీటీసీ, 15 ఎంపీటీసీ స్థానాలకు పోటీ చేయాలని జిల్లా కౌన్సిల్ సమావేశంలో నిర్ణయించామన్నారు. ఆ విధంగా సీపీఐ నాయకులు సిద్ధంగా ఉండాలన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇచ్చి గెలిపించామని, భవిష్యత్ ఎన్నికల్లో ఇదే రీతిలో కలిసి పని చేద్దామని ఆనాడే కాంగ్రెస్ నాయకులు మాట ఇచ్చారని గుర్తు చేశారు. ఇచ్చిన మాటకు కట్టుబడి స్థానిక సంస్థల ఎన్నికల్లో సీపీఐకి సముచితమైన సీట్లు ఇవ్వాలని అన్నారు. లేని పక్షంలో తమతో కలిసి వచ్చే పార్టీలతో పొత్తు పెట్టుకుని పోటీలో దిగుతామన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి విజయరాములు, కళావతమ్మ, చంద్రయ్య, రమేష్, శ్రీరాం, సీఎస్ శెట్టి, రాబర్ట్, మోష, అబ్రహం, భాస్కర్, కురుమయ్య, గోపాల్, శ్రీహరి, కుతూబ్, ఎర్ర కురుమయ్య, గోపాల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు బాల నరసింహ

జములమ్మ క్షేత్రంలో నేడు నిజరూప దర్శనం


రిజర్వాయర్‌లో విహరించేందుకు ఏర్పాట్లు చేసిన అధికారులు

- తెప్పోత్సవానికి ఏర్పాట్లు పూర్తి


మహిషాసురమర్ధిని అలంకరణలో అమ్మవారు

గద్వాల, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లాలోని జమ్మిచేడ్ జములమ్మ ఆలయంలో దసరా నవరాత్రి ఉత్సవాలు ముగింపు దశకు చేరుకున్నాయి. అమ్మవారు బుధవారం మహిషాసుర మర్దనీ దేవి అలంకరణలో భక్తుల పూజలు అందుకున్నారు. ఆలయ చైర్మన్ వెంకట్రాములు, ఈవో పురేందర్ కుమార్‌లు తొలి పూజలు చేశారు. అమ్మవారి దర్శనానికి భక్తులు వేలాదిగా తరలివచ్చారు. దసరా నవరాత్రి ఉత్సవాలలో చివరి రోజు అమ్మవారు నిజరూపదర్శనంలో భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు. ఈ సందర్భంగా అమ్మవారిని దర్శించుకోవడానికి భక్తులు అధిక సంఖ్యలో తరలిరానున్నారు. సాయంత్రం అమ్మవారి పల్లకిసేవ, శమీ పూజ, అనంతరం జములమ్మ రిజర్వాయర్‌లో తెప్పోత్సవం నిర్వహించనున్నారు. అందుకు అవసరమైన ఏర్పాట్లను అధికారులు, ఆలయకమిటీ సభ్యులు ఏర్పాట్లు పూర్తి చేశారు. విజయవాడ కనకదుర్గ, జోగుళాంబ అమ్మవార్లకు నిర్వహించే విధంగానే ఈ ఏడాది తెప్పోత్సవాన్ని వైభవంగా నిర్వహించనున్నారు.

టీడీపీ హయాంలోనే ఆలయ పునర్నిర్మాణం

- మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు
- జోగుళాంబకు పట్టు వస్త్రాల సమర్పణ


అలంపూర్ జోగుళాంబ ఆలయంలో టీడీపీ మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు

అలంపూర్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి) : పూర్వం కూల్చివేతకు గురైన అలంపూర్ జోగుళాంబ ఆలయాన్ని టీడీపీ హయాంలోనే పునర్నిర్మించినట్లు షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే, ఆ పార్టీ నాయకుడు బక్కని నర్సింహులు అన్నారు. దివంగత వాజపేయి ప్రధానిగా ఉన్నప్పుడు, అనుమతులు తీసుకొని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకుడు పునర్నిర్మించినట్లు తెలిపారు. దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని బుధవారం టీడీపీ తరపున జోగుళాంబ అమ్మవారికి పట్టు వస్త్రాలను సమర్పించారు. స్వామి వారి ఆలయంలో అభిషేకం, అమ్మవారి ఆలయంలో కుంకుమార్చన తదితర విశేష పూజలు చేశారు. ఆలయ అభివృద్ధికి సీఎం చంద్రబాబునాయుడు ఎంతో కృషి చేశారని గుర్తు చేశారు. అప్పటి నుంచి ఆనవాయితీగా అమ్మవారికి పట్టువస్త్రాలను సమర్పిస్తున్నామన్నారు. రాష్ట్ర ప్రజలందరూ ఆయురారోగ్యాలతో జీవించాలని అమ్మవారిని పూజించినట్లు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ అలంపూర్ ఇన్‌చార్జి ఆంజనేయులు, మండల అధ్యక్షుడు అబ్దుల్లా, ముజీబ్, సుధాకర్ గౌడ్, చంద్రశేఖర్ నాయుడు, హాజీబాషా తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

గ్రామాభివృద్ధే లక్ష్యం



రోడ్డు మరమ్మతులు చేయిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకుడు వెంకటేశ్

తిమ్మాజిపేట, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి) : గ్రామాభివృద్ధే లక్ష్యంగా ముందుకెళ్తానని కాంగ్రెస్ పార్టీ నాయకులు దోమ వెంకటేశ్ అన్నారు. తిమ్మాజిపట మండల పరిధిలోని మారేపల్లికి తిమ్మాజిపేట నుంచి వెళ్లే రహదారి ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డు అధ్వానంగా గుంతలమయంగా మారడంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయాన్ని తెలుసుకున్న అదే గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు దోమ వెంకటేశ్ స్పందించి బుధవారం తన సొంత నిధులతో మరమ్మతులు చేపట్టారు. గ్రామంలో ఎల్ఈడీ బల్బులు సంబంధిత అధికారులకు ఇప్పించారు. గ్రామంలో సామాజిక కార్యక్రమాలు చేయడంలో ముందుంటానని ఆయన తెలిపారు. కాంగ్రెస్ నాయకులు మల్లయ్య, శ్రీరామ్ ఉన్నారు.

బీఆర్ఎస్‌లో చేరిన బీజేపీ నాయకులు

తిమ్మాజిపేట, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని పోతిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన 20మంది బీజేపీ నాయకులు బుధవారం హైదరాబాద్‌లోని నాగర్‌కర్నూల్ మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. మర్రి మాట్లాడుతూ పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుందని అన్నారు. బీఆర్ఎస్ పార్టీలో చేరిన నాయకులు మాట్లాడుతూ ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న కాంగ్రెస్ పార్టీని ఓడించడమే తమ లక్ష్యమని అన్నారు. అందుకే బీఆర్ఎస్ పార్టీలో చేరుతున్నామన్నారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు జోగు ప్రదీప్, నాయకులు వెంకట స్వామి మాజీ సర్పంచ్ బాలరాజు ఉన్నారు.

స్థానిక ఎన్నికల్లో మా పార్టీ పోటీ : బీజేపీ

చారకొండ, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి) : జడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచు ఎన్నికల్లో అన్ని స్థానాల్లో బీజేపీ పోటీ చేస్తుందని ఆ పార్టీ మండల అధ్యక్షుడు చెలమోని కృష్ణ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ ఎన్నికల్లో బీజేపీ కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు. బడుగు, బలహీన వర్గ, పేద ప్రజల సమస్యలను పరిష్కరించడానికి బీజేపీ కృషి చేస్తుందని అన్నారు. స్థానిక ఎన్నికల్లో సత్తా చాటాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీజేపీ మండల ప్రధాన కార్యదర్శులు వేణుశర్మ, హరిబాబు, మండల ఉపాధ్యక్షుడు కామోజీ శ్రీకాంత్, పబ్బు రఘుగౌడ్, శంకర్, మహేష్‌రెడ్డి, ఎదిరే రవీందర్, రవి, చంద్రారెడ్డి, పెద్దిరాజు, నరేష్, పూల్‌సింగ్, మల్లేష్, రాములు, సైదులు, మహేందర్, జంగయ్య పాల్గొన్నారు.

సామాజిక మార్పు కోసం పంచపరివర్తన్ అవసరం

- ఆర్ఎస్ఎస్ జిల్లా సంపర్క ప్రముఖ్ సూరంపల్లి సాయిబాబు

లింగాల, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి) : సామాజిక దృక్పథంతో మార్పు కోసం నేటి సమాజానికి పంచపరివర్తన్ అవసరం ఉందని ఆర్ఎస్ఎస్ జిల్లా సంపర్క ప్రముఖ్ సూరంపల్లి సాయిబాబు పిలుపునిచ్చారు. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ శతాబ్ది దసరా ఉత్సవ మండల పరిధిలోని రాయవరం గ్రామంలో బుధవారం ఘనంగా జరుపుకున్నారు. శక్తితోపాటు సంస్కారం, సేవాభావం కలిగి ఉండి సంఘ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్తూ దేశసార్వతోముఖాభివృద్ధి కోసం అహర్నిషలు కృషి చేస్తామని సంఘ పరివార్ సభ్యులు ప్రతిజ్ఞ చేశారు. ఆయన మాట్లాడుతూ 1925 విజయదశమి రోజున డాక్టర్ హెడ్గేవార్ ఆర్ఎస్ఎస్ స్థాపించి వందేళ్లు పూర్తి కాబోతున్న సందర్భంగా దేశం మొత్తం దసరా ఉత్సవం నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మల్లయ్య, తెలకపల్లి ఖండ కార్యవహాగా కేతావత్ శివనందన్, ఖండ సేవా ప్రముఖ్ ముడావత్ శ్రీనివాసులు, ఉప మండల ప్రముఖ్ పాత్లావత్ శంకర్, రాయవరం శాఖ కార్యవహా బసరత్ శివశంకర్, బీజేపీ మండల అధ్యక్షుడు గువ్వని నవీన్, గ్రామ పెద్దలు తిరుపతిరెడ్డి, ఉల్లంగొండ్ల రాజు, శివయ్య, లోకనాథంగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

దేశ సౌభాగ్యమే ఆర్ఎస్ఎస్ ధ్యేయం



మన్ననూరు వేణుగోపాలస్వామి ఆలయంలో వనవాసీ కల్యాణ పరిషత్ నాయకులు

మన్ననూర్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): దేశ సౌభాగ్యమే రాష్ట్రీయ స్వయం సేవక్ ధ్యేయమని వనవాసీ కల్యాణ పరిషత్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు కాట్రాజు వెంకటయ్య అన్నారు. ఆర్‌యస్‌యస్ శతాబ్ది ఉత్సవాలను పురస్కరించుకొని అమ్రాబాద్ మండలం మన్ననూరు వేణుగోపాలస్వామి ఆలయంలో బుధవారం దసరా ఉత్సవాన్ని నిర్వహించారు. దసరా పర్వదినాన్ని హిందూ బంధువులందరూ ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ జిల్లా ఉపాధ్యక్షుడు సంభు వెంకట్‌రమణ, వనవాసీ కల్యాణ పరిషత్ స్థానిక నాయకులు లింగయ్య, శివ, సంభు శ్రీనివాసులు, చంద్రమౌళి, వెలిజాల శ్రీనివాసులు, సురేష్, ఆంజనేయులు పాల్గొన్నారు.

మహాగౌరీ దేవిగా...

- ఉమామహేశ్వర క్షేత్రంలో దర్శనం

- రాఘవేంద్రకాలనీలో మహిషాసుర మర్దినిగా దుర్గామాత



నాగర్‌కర్నూల్‌లో మహిషాసుర మర్దినిగా దుర్గామాత



కల్వకుర్తిలో మహిషాసుర మర్దినిగా వాసవీమాత

కందనూలు/ అచ్చంపేట/ టౌన్/ కల్వకుర్తి/ కొల్లాపూర్/ తాడూరు, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని టెలిఫోన్ ఎక్స్ఛేంజ్ పక్కన గల రాఘవేంద్ర కాలనీ రోడ్డు నెంబరు-1, 2లో దేవీశరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పదవ రోజు దుర్గామాతను మహిషాసుర మర్దినిగా అలంకరించి, పూజలు చేశారు. జిల్లా కేంద్రంలో వాసవీకన్యకాపరమేశ్వరి ఆలయంలో సాయి బాలాజీ సిండికేట్, ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం అమ్మవారు భక్తులకు మహిషాసుర మర్దినిగా దర్శనమిచ్చారు. అచ్చంపేట మండలం ఉమామహేశ్వర క్షేత్రంలో బుధవారం అమ్మవారు మహాగౌరీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ఈఓ శ్రీనివాసరావు, ఆలయ కమిటీ చైర్మన్ బీరం మాధవరెడ్డి తెలిపారు. అచ్చంపేట పట్టణంలోని వివిధ కాలనీలలో దుర్గాదేవి పూజలందుకున్నారు. స్థానిక ఎమ్మెల్యే వంశీకృష్ణ దంపతులు కన్యకాపరమేశ్వరి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. హోమంలో మునిసిపల్ చైర్మన్ శ్రీనివాసులు దంపతులు పాల్గొన్నారు.

దైవచింతనతో మానసిక ప్రశాంతత

కల్వకుర్తి పట్టణ కేంద్రంలోని వాసవీ కన్యకా పరమేశ్వరి దేవాలయంలో ఉత్సవాలకు సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి హాజరయ్యారు. ఆలయ ఫౌండర్ ట్రస్టు చైర్మన్ జూలూరు రమేష్‌బాబు ఘన స్వాగతం పలికారు. వాసవీమాత మహిషాసుర మర్దినిదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. కల్వకుర్తి మండలం లింగసానిపల్లి గ్రామంలో దుర్గాదేవి అమ్మవారిని ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, టాస్క్ సీఈవో సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి దర్శించుకున్నారు.

● కొల్లాపూర్ : మండల పరిధిలోని యన్మన్‌బెట్ల గ్రామంలో మాజీ సర్పంచ్ మేకల నాగరాజు దుర్గామాతను దర్శించుకున్నారు.

● తాడూరు : మండల కేంద్రంతోపాటు మండలంలోని అన్నిగ్రామాల్లో ప్రతిష్ఠించిన దుర్గామాత మండపాల వద్ద దేవీనవరాత్రి వేడుకలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. బుధవారం మండలంలోని ఆకునెల్లికుదురు గుట్టపై వెలిసిన రామలింగేశ్వరస్వామి దేవాలయంలో మహిషాసుర మర్దిని రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు.



అచ్చంపేట : భక్తమార్కండేయ ఆలయంలో పూజలు చేస్తున్న ప్రజలు



కొల్లాపూర్ : యన్మన్‌బెట్ల గ్రామంలో పూజలు చేస్తున్న ప్రజలు



అచ్చంపేట : కన్యకాపరమేశ్వరి ఆలయంలో జరిగిన హోమంలో ఎమ్మెల్యే దంపతులు

ఎన్నికల కోడ్‌ను పకడ్బందీగా అమలు చేయాలి

- అధికారుల శిక్షణలో అచ్చంపేట ఆర్డీవో మాధవి



ఉప్పునుంతల సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో మాధవి

ఉప్పునుంతల, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల కోడ్‌ను పకడ్బందీగా అమలు చేయాలని అధికారులకు అచ్చంపేట ఆర్డీవో మాధవి సూచించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో మండల ప్రత్యేక అధికారి నాగేందర్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఆర్డీవో మాధవి మాట్లాడుతూ జడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్‌ల ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కోడ్ అమల్లోఉందని, అధికారులు ఎన్నికల కోడ్ అమలు చేయాలని సూచించారు. ఎన్నికల కోడ్‌ను ఎవరు ఉల్లంఘించినా చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో పంచాయతీ కార్యదర్శులు, మండలంలోని వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో మోహన్‌లాల్, డీటీ పరశునాయక్, ఎంపీవో వెంకటేష్, ఎంఈవో చంద్రశేఖర్ ఉన్నారు.

పకడ్బందీగా నిర్వహించాలి

కల్వకుర్తి : ఎంపీటీసీ, జడ్పీటీసీ, సర్పంచ్ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలని కల్వకుర్తి ఎంపీడీవో ఎస్.వెంకట్రాములు, తహసీల్దార్ ఇబ్రహీంలు కోరారు. కల్వకుర్తి పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయం సమావేశ మందిరంలో బుధవారం స్థానిక సంస్థల ఎన్నికలపై ప్రిసైడింగ్ అధికారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. పోలింగ్ స్టేషన్లలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. సమావేశంలో ఎంఈవో శంకర్ నాయక్, ఏవో సురేష్, పీవోలు పాల్గొన్నారు.

పోలింగ్ ఆఫీసర్లకు అవగాహన

అచ్చంపేటటౌన్ : స్థానిక సంస్థల ఎన్నికల్లో అధికారులు పాటించాల్సిన జాగ్రత్తలపై బుధవారం పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీటీసీ, జడ్పీటీసీ, పీవోలతో పాటు గ్రామ పంచాయతీ పీవోలకు శిక్షణ నిర్వహించారు. ఈ సమావేశానికి తహసీల్దార్ సైదులు, ఎంపీడీవో మధుసూదన్‌గౌడ్, ఆర్‌వో వెంకటేశం, ఎంపీవో పాండు పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.

అధికారులకు శిక్షణ

పెద్దకొత్తపల్లి : స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై ఉద్యోగులకు బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో శిక్షణ నిర్వహించారు. శిక్షణలో తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీవో నాగేంద్రం,ఎంఈవో శ్రీనివాస్‌రెడ్డి, ఏపీవో పాల్గొన్నారు.

మొదటి విడత శిక్షణ

చారకొండ : స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై అధికారులకు మొదటి విడత శిక్షణ కార్యక్రమం స్థానిక రైతువేదికలో చేశారు. ఈ కార్యక్రమానికి మండల స్పెషల్ ఆఫీసర్ జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల రిటర్నింగ్ ఆఫీసర్ (ఆర్‌వో) రఘునందన్ రావు, సర్పంచు ఎన్నికల రిటర్నింగ్ ఆఫీసర్లు తహసీల్దార్ అద్దంకి సునీత, మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ ఆఫీసర్లు ఎంపీడీవో శంకర్‌నాయక్, ఎంపీవో నారాయణ హాజరయ్యారు.

పక్కాగా నిర్వహించాలి

పెంట్లవెల్లి : ఎంపీటీసీ, జడ్పీటీసీ, గ్రామ పంచాయతీ ఎన్నికలు పక్కాగా నిర్వహించాలని ఎంపీడీవో దేవేందర్ అన్నారు. ఎన్నికల కమిషనర్ ఆదేశాల మేరకు బుధవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో శిక్షణ సమావేశం నిర్వహించారు. బుధవారం 52 మంది పీవోలతో సమావేశం నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఓ సత్తయ్య, డిప్యూటీ తహసీల్దార్ రాజ్‌కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుడు ఎద్దుల రాధాకృష్ణకు పరామర్శ



నాగర్‌కర్నూల్‌లో రాధాకృష్ణను పరామర్శిస్తున్న కవులు, కళాకారులు, రచయితలు

నాగర్‌కర్నూల్ టౌన్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి) : ఇటీవలే అనారోగ్యంతో గుండె ఆపరేషన్ చేయించుకున్న కాంగ్రెస్ నాయకుడు ఎద్దుల రాధాకృష్ణను కవులు, కళాకారులు, రచయితలు పరామర్శించారు. బుధ వారం జిల్లా కేంద్రంలోని ఎస్సీ ఎస్టీ, బీసీ మైనార్టీ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు జెట్టి ధర్మరాజు ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్న రాధాకృష్ణను కలిసిన వారు ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. రాధాకృష్ణ ఇటీవలే హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో గుండె బైపాస్ సర్జరీ చేయించుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాధాకృష్ణకు మనోధైర్యం ఇచ్చి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. పరామర్శించిన వారిలో కందనూలు కళాకారులు వనపట్ల సుబ్బయ్య, కందికొండ మోహన్, ఎదిరేపల్లి కాశన్న, వహీద్ ఖాన్, మచ్చర్ల దినకర్, కల్వకోల్ మద్దిలేటి, టీచర్ ఖాజా తదితరులు ఉన్నారు.

ముక్కిడిగుండంలో గిరిజన ఉత్సవాలు

- వాలీబాల్ పోటీలు ప్రారంభం

కొల్లాపూర్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని ముక్కిడి గుండం గ్రామంలో మండల స్థాయి రెండు రోజుల గిరిజన ఉత్సవాలు బుధవారం అట్టహాసంగా ప్రారంభ మయ్యాయి. గ్రామవాసి గిరిజన సంఘం నాయకుడు దేశావత్ వెంకట్ నాయక్ తన సొంత ఖర్చులతో చేపట్టిన వాలీబాల్ పోటీలకు వివిధ గిరిజన తండాల నుంచి 12టీంలు పాల్గొన్నాయి. మొదట టాస్ వేయగా ఎల్లూరు, మొలచింతలపల్లి జట్ల మధ్య జరిగిన వాలీబాల్ పోటీ రసవత్తరంగా సాగింది. ఈ పోటీల్లో విజేతలకు మొదటి బహుమతి రూ.5వేలు, రెండోబహుమతి రూ.3 వేలు, మూడో బహుమతి రూ.2వేలు నిర్వాహకులు ప్రకటించారు. మండలంలోని గేమ్యా తండా, సున్నపుతండా, మొలచింతలపల్లి, ముక్కిడి గుండం, ఎల్లూరు, కొల్లాపూర్‌తో పాటు పలు గిరిజన తండాల నుంచి క్రీడాకారులు తరలివచ్చారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి సింగిల్‌విండో మాజీ డైరెక్టర్ దేశావత్ భోజ్యా నాయక్, భాస్కర్ నాయక్ హాజరై మాట్లాడారు. క్రీడల వల్ల స్నేహభావం పెంపొందుతుందని అన్నారు. ఐక్యతకు దోహదం అవుతుందని అన్నారు.

దేవాలయాల అభివృద్ధికి ప్రాధాన్యం

- టాస్క్ సీవోవో, ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి



ఆలయ అభివృద్ధికి చెక్కు అందజేస్తున్న రాఘవేందర్‌రెడ్డి

వెల్దండ, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లోని దేవాలయాల అభివృద్ధికి, నిర్మాణాలకు ప్రాధాన్యతనిచ్చి సహకరిస్తానని టాస్క్ సీవోవో, ఐక్యతఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని నారాయణపూర్ తండాలో నిర్మాణంలో ఉన్న హనుమాన్ దేవాలయాన్ని రాఘవేందర్‌రెడ్డి సందర్శించారు. గతంలో ఆలయ నిర్మాణానికి ఇచ్చిన హామీమేరకు రూ. ఐదు లక్షలకుగాను మొదటి విడతగా రూ. 2,50,000 లక్షల చెక్కును ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. దేవాలయాలు సంస్కృతీ, సంప్రదాయాలకు ప్రతీకలని, వాటిని పరిరక్షించుకోవడం ప్రతీ ఒక్కరి ధర్మమని అన్నారు. విద్య, వైద్యం, ఉపాధి లక్ష్యాలతో ముందుకుసాగుతున్నామన్నారు. కార్యక్రమంలో నాయకులు గోపాల్‌నాయక్, అంజినాయక్, రమేష్‌నాయక్, గోపి, తారాసింగ్, లక్ష్మీపతి పాల్గొన్నారు.

గోప్లాపూర్‌లో ముగ్గుల పోటీలు



గోప్లాపూర్‌లో దుర్గామాత మండపం వద్ద ముగ్గులు వేస్తున్న మహిళలు

పెంట్లవెల్లి అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంతో పాటు జటప్రోలు, పెంట్లవెల్లి గ్రామాలలో దుర్గామాత దగ్గర పూజలు కొనసాగుతున్నాయి. దుర్గామాత అమ్మవారు బుధవారం మహిషాసుర వర్దిని అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి నిత్యం పూజలు నిర్వహిస్తున్నారు. బుధవారం గోప్లాపూర్ దుర్గా మాత దగ్గర మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. అదేవిధంగా రామాపురం దుర్గామాత దగ్గర అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

రక్తదానం మహత్తర సేవ

- జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ రవికుమార్



రక్తదాతలను సన్మానిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ రవికుమార్

కందనూలు, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి) : రక్తదానం మహత్తర సేవ అని జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ రవికుమార్ అన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో జాతీయ రక్తదాన దినోత్సవాన్ని జిల్లా పరిషత్ (పాత కలెక్టరేట్) ఆవరణలో ఘనంగా నిర్వహించారు. రక్తదాతలను డీఎంహెచ్‌వో ఘనంగా సన్మానించారు. ఆయన మాట్లాడుతూ రక్త దానం ఒక మహత్తరమైన మానవతా సేవ అన్నారు. రక్తం తయారు చేయలేనిదని, అవసర మైన సమయంలో రక్తం ఇచ్చే వారే నిజమైన దేవుళ్లని పేర్కొన్నారు. జిల్లాలో రక్తం కొరత రాకుండా అందరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ సెక్రటరీ రమే ష్‌రెడ్డి, యూత్ రెడ్‌క్రాస్ జిల్లా కన్వీనర్ కుమా ర్, సభ్యులు సురేష్, వైద్య సిబ్బంది, రక్తదాతలు మహేందర్, సురేందర్, బుచ్చయ్య పాల్గొన్నారు.

అంబరాన్నంటిన బతుకమ్మ సంబురాలు



పెద్దకొత్తపల్లిలో పోటీల ప్రదర్శనలో ఉంచిన బతుకమ్మలు

పెద్దకొత్తపల్లి, అక్టోబరు1 (ఆంధ్రజ్యోతి) : దసరా, బతుకమ్మ సంబురాల పోటీల సందర్భంగా పెద్దకొత్తపల్లి గ్రామంలో బుధవారం సాయంత్రం కొత్త తహసీల్దార్ కార్యాలయం దగ్గర చౌరస్తాలో మహిళలకు నిర్వహించిన బతుకమ్మ పోటీలు అంబరాన్నంటాయి. సహజంగా తీరొక్క పూలతో ప్రత్యేకంగా అలంకరించిన వంద బతుకమ్మలను ఈ పోటీల్లో ప్రదర్శించారు. ఈ పోటీల్లో గెలిచిన మహిళా గ్రూపులకు మొదటి బహుమతిగా 3గ్రాముల బంగారం, రెండవ బహుమతిగా 2గ్రాములు, మూడవ బహుమతిగా 1గ్రాము బంగారం ప్రదానం చేశారు. బతుకమ్మ సంబురాల్లో పాల్గొన్న ప్రతీ గ్రూపునకు 3తులాల వెండిని ప్రోత్సాహక బహుమతులుగా ప్రదానం చేశారు. ఈ పోటీలను వీక్షించేందుకు మహిళలు భారీగా తరలివచ్చారు. దీంతో పండుగవాతావరణం సంతరించుకుంది. విజేతలకు మండల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ దండు నరసింహ, మాజీ సర్పంచ్ ఆదెర్ల వెంకటేశ్వర్‌రెడ్డి, సింగిల్ విండో డైరెక్టర్ దండు చంద్రయ్య, మాజీ ఎంపీటీసీలు శశికళ, మాధవి, అశోక్‌రెడ్డి, ఎల్లయ్య, ఎల్లయ్య, మల్లేష్, రామకృష్ణ, బాలస్వామి, నాగరాజు, శివశంకర్ బహుమతులు ప్రదానం చేశారు.

ఘనంగా ప్రపంచ వృద్ధుల దినోత్సవం



వృద్ధులను శాలువాతో సన్మానిస్తున్న గాంధీజీ యువజన సంఘం అధ్యక్షుడు పరంజ్యోతి

కొల్లాపూర్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి) : నేటి సమా జంలో జన్మనిచ్చిన తల్లిదండ్రులను వృద్ధాశ్రమంలో విడిచిపెడుతున్న కుమారులు, కుమార్తెలు తమ విధానం మార్చుకోవాలని టీపీసీసీ కార్యనిర్వాహక కార్యదర్శి రంగినేని జగదీశ్వరుడు పిలుపునిచ్చారు. పట్టణంలోని విశ్వశాంతి వెల్ఫేర్ సొసైటీ వృద్ధాశ్ర మంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం ప్రపంచ వయోవృద్ధుల దినోత్సవం సందర్భంగా పలువురు వృద్ధులను ఘనంగా సన్మానించారు. ఆయన మాట్లాడుతూ సమాజంలో వృద్ధులను ప్రతీ ఒక్కరు గౌరవించి ఆదరించాలని కోరారు. వృద్ధులకు పండ్లు, బ్రెడ్లు అందించారు. కార్యక్రమంలో మధుసూదన్‌రావు, న్యాయవాది రాము యాదవ్, విశ్వశాంతి వృద్ధా శ్రమం నిర్వాహకులు శివ, చిట్టిబాబు, వెంకట స్వామి పాల్గొన్నారు.

● చారకొండ : ప్రపంచ వృద్ధుల దినోత్సవం సందర్భంగా మండల పరిధిలోని జూపల్లిలో బుధవారం గాంధీజీ యువజన సంఘం ఆధ్వర్యంలో ప్రపంచ వృద్ధుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వృద్ధులను వాలువాతో సన్మానించి పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గాంధీజీ యువజన సంఘం అధ్యక్షుడు నాయిని పరంజ్యోతి, సంఘం సభ్యులు సిరాజ్, రామస్వామి, మల్లేష్, రాజు, బాలస్వామి, నిరంజన్ పాల్గొన్నారు.

ఒక్క వార్డునైనా ఎస్సీ రిజర్వ్ చేయాలి

- డీపీవోకు వినతి పత్రం అందజేసిన చేగుంట గ్రామ ప్రజలు



డీపీవోకు వినతి పత్రం అందజేస్తున్న చేగుంట ప్రజలు

తిమ్మాజిపేట, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి) : గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి తమ గ్రామంలో ఒక వార్డునైనా ఎస్సీలకు రిజర్వేషన్ కల్పించాలని కోరుతూ బుధవారం నాగర్‌కర్నూల్ జిల్లా పంచాయతీ అధికారి శ్రీరామ్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. తిమ్మాజిపేట మండల పరిధిలోని చేగుంట గ్రామంలో పది వార్డులు ఉండగా అందులో ఆరు జనరల్‌కు కేటాయించగా మరో నాలుగు బీసీలకు కేటాయించారని తెలిపారు. ఒక్క వార్డు కూడా ఎస్సీ రిజర్వేషన్ లేకపోవడంతో ఎం పీటీల సంఘం మాజీ అధ్యక్షుడు కిల్లె మల్లయ్యతో కలిసి ఎంపీడీవో లక్ష్మీదేవికి, జిల్లా పంచాయతీ అధికారికి వినతిపత్రాలను అందజేశారు. గ్రామంలో ఒక్క వార్డునైనా ఎస్సీలకు రిజర్వేషన్ కల్పించాలని వారు డిమాండ్ చేశారు.గాలిరాజు, చెన్నయ్య, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

దాతల సహకారంతో మొలకమామిడిలో అభివృద్ధి

- రేపు అభివృద్ధి పనులను ప్రారంభించనున్న ఎంపీ, ఎమ్మెల్యే



మొలకమామిడిలో దాతల సహకారంతో నిర్మించిన పాఠశాల భవనం

అమ్రాబాద్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని మొలకమామిడి గ్రామ అభివృద్ధికి 6నెలల క్రితం ప్రారంభించి దాతల సహకారంతో విలేజ్ డెవలప్‌మెంట్ కమిటీ ఆధ్వర్యంలో దసరా ఉత్సవాలను గ్రామంలో పెద్ద ఎత్తున జరుపుకోవడంతో పాటు ఆ పనులను రాజకీయ నేతలతో ప్రారంభించనున్నారు. నల్లమలలో ఆదర్శంగా ఈ గ్రామ యువత గ్రామ రూపురేఖలను మార్చు చేయడానికి నడుం బిగించడం మూలంగా ఈ గ్రామం సమగ్రంగా అభివృద్ధి చెందడానికి అడుగులు పడుతున్నాయని చెప్పవచ్చు. గ్రామంలో లక్షలాది రూపాయలు వెచ్చించి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రహరీ నిర్మాణంతో పాటు విద్యార్థులకు అవసరమయ్యే మౌలిక సదుపాయాలన్నింటినీ ఏర్పాటు చేశారు. అదేవిధంగా అచ్చంపేట- మద్దిమడుగు ప్రధాన రహదారిపై ఆర్చి గేటు నిర్మించారు. అలాగే గ్రామ సమీపంలో నల్లమల సీవీకే క్రీడా ప్రాంగణం తయారు చేసి అందులో కూడా పలు సౌకర్యాలు కల్పించారు. ప్రధాన రహదారి వద్ద బస్‌షెల్టర్ నిర్మాణంతో పాటు గ్రంథాలయం, వాటర్‌ప్లాంట్ గ్రామంలో దేవాలయ నిర్మాణం చేపట్టాలని నిర్ణయించారు.



మొలకమామిడిలో దాతల సహకారంతో నిర్మించిన క్రీడా ప్రాంగణం

ఈనెల 3వ తేదీన...

ఈ గ్రామానికి చెంది న పలువురి దాతల సహకారంతో పూర్తి చేసిన అభివృద్ధి కార్యక్రమాలను ఈనెల 3వ తేదీన నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ మల్లు రవి, అచ్చంపేట శాసన సభ్యుడు డాక్టర్ వంశీకృష్ణ, ఇతర ప్రముఖులు హాజరై అభివృద్ధి పనులను ప్రారంభించనున్నట్లు విలేజ్ డెవలప్‌మెంట్ కమిటీ అధ్యక్షు డు బి.జనార్దన్ బుధవారం మొలకమామిడిలో విలేకర్లకు తెలిపారు. కార్యక్రమంలో వీడీసీ కమిటీ ప్రతినిధులు ఓంకార్, చెన్నకిష్టయ్య, అశోక్‌రెడ్డి, వెంకటేశ్, పరమేశ్ పాల్గొన్నారు.